
# వరుడు కావలెను
# (కట్నంతోపాటు కిరసనాయిలు ఉచితం)



పెళ్ళి పందిరంతా చాలా హడావుడిగా వుంది

ఆడా, మగా, పిల్లా, పీచు– ఓ పక్కబాండ్ మేళం, మరోపక్క పెళ్ళిపెద్దల కేకలతో హెూరెక్కిపోతోంది.

నేనూ, శాయీరామ్ రంగారెడ్డి, జనార్ధన్ మొదలయిన కాలనీ వాళ్ళందరం కలసి, కుర్చీల్లో గుంపుగా కుర్చీని బాతాఖాని కొడుతున్నాం– శాయీరామ్ ఆ తరువాత జరగబోయే కాలనీ మీటింగు తాలూకూ ఎజెండా గురించి ఎడా పెడా చర్చిస్తున్నాడు.

అది మా కాలనీ ప్రెసిడెంట్ గోపాల్రావ్‌గారి అమ్మాయి పెళ్ళి అవడం వల్ల కాలనీ వాళ్ళందరూ గుమికూడారక్కడ.

ముహూర్తం దగ్గర పడిపోంది. పెళ్ళికొడుకు తాలి పట్టుకుని రెడీ అయిపోయాడు. బాజాలవాళ్ళు వేగం విపరీతంగా పెంచేశారు– ఏదో కొంపమునుగబోతుందన్నట్లు.

"మన తెలుగు సినిమాల్లో అయితే సరిగ్గా ఇలాంటి సీన్‌లోనే "ఆగండి!" అంటూ కేక వినబడుతుంది! కదూ" అన్నాడు రంగారెడ్డి.

"అవును! ఇలాంటి 'ఆగండి' సీన్లమీదే కొన్ని వందల సినిమాలొచ్చాయ్" అన్నాడు. శాయిరామ్. "అయినాగాని మన ప్రేక్షకులకు ఇంకా ఆ సీన్‌లంటేనే యిష్టం"

సరిగ్గా అప్పుడే "ఆగండి!" అన్నకేక వినిపించి అందరం ఉలిక్కిపడ్డాం. మాతోపాటు పెళ్ళి పందిరంతా కూడా నిశ్శబ్దం అయిపోయింది.

"ఎవరో భలేజోకు వేశాడు" అన్నాడు శాయిరామ్ పగలబడి నవ్వుతూ. మేమంతా కూడా నవ్వబోయాంగాని ఆ గొంతు మళ్ళీ కర్కశంగా. "జోకుకాదు- గాడిదగుడ్డూకాదు" అని అరచింది.

ఈసారి ఆ గొంతుతాలూకూ ఓనర్‌ని అందరం జాగ్రత్తగా చూశాం. ఆ గొంతు ఓనర్ మరెవరో కాదు. పెళ్ళికొడుకు తండ్రి. శాయిరామ్‌ని కోపంగా చూస్తున్నాడతను.

"జోక్‌కాదాండి!" కొంచెం తగ్గి అడిగాడు శాయిరామ్.

"గాడిదగుడ్డు జోకు! జోకేమిటయ్యా! ఇది జోకులేసుకునే టైమా?"

ఇంకా మండిపడుతూ శాయిరామ్ మీద కొచ్చాడతను. శాయిరామ్ మరో నాలుగడుగులు వెనక్కువేశాడు.

"నేను జోకనుకున్నానులెండి."

"బుద్ధుండాలి అలా అనుకోవడానికి."

ఇక లాభంలేదని నేనూ రెడ్డీ జోక్యం చేసుకున్నాం.

"వాడికి కొంచెం బుద్ధి సరిగ్గా ఉండటం లేదులెండి. అదీ ఈ మధ్య... టి.వి.లో డ్రామా లేయడం మొదలెట్టినప్పటి నుంచేలెండి! అంతకుముందు బాగానే ఉండేది-" అని సర్దిచెప్పాడు రెడ్డి.

ఇంతలో గోపాల్రావ్ పరుగుతో వచ్చాడు మా దగ్గరికి.

"ఏమిటి వియ్యంకుడుగారూ! ఏం జరిగింది" అన్నాడు గాబరాగా.

"గాడిదగుడ్డు జరిగింది" అన్నాడు బట్టతలాయన బట్టతల సవర్దీసుకుంటూ.

"గాడిదగుడ్డా?"

"అవును!"

"గాడిదగుడ్డు జరగడమేమిటి?" మరింత గాబరాగా అడిగాడు.

"కాకపోతే ఏమిటయ్యా! తాళికట్టే టైము దగ్గరపడింది! ఇంతవరకూ వప్పుకున్న కట్న కానుకలన్నీ ఇవ్వరేం."

"అదేమిటీ? కట్నంముందే ఇచ్చాంగా?"

"కట్నం సంగతి సరేనయ్యా. కిర్సనాయలుసంగతేమిటి?"

"కిర్సనాయిలా?"

“అవును”

“కిర్సనాయిలు ఇప్పుడెందుకు?”

“ఇప్పుడుకాకపోతే ఎప్పుడిస్తారయ్యా? మాకోడలిని తగలేసుకోవద్దా?”

“వీల్లేదు. మా వంశాచారం ప్రకారం పదకొండో నెలవరకూ ఇంటికోడలిని తగలెట్టడానికి వీల్లేదు” అరచాడు గోపాల్రావ్.

“మీ బోడి వంశచారం- మీ కోడలికి పాటించండి. మా కోడలిని ఎప్పుడు కిర్సనాయిలుతో తగలెయ్యాలో అది మా ఇష్టం”

“కాదు. మా ఇష్టం” అన్నాడు గోపాల్రావ్.

“అలా ఒకరికొరకు రెచ్చిపోతే ఎలా గోపాల్రావ్‌గారూ! ఇలాంటి విషయాల్లో పట్టు విడుపులంటూ లేకపోతే కష్టం. మన అమ్మాయిని వాళ్ళచేతుల్లో పెట్టాక వాళ్ళు ఎప్పుడయినా తగలేసుకోనీండి. మనం అడ్డు చెప్పడం బావుండదు” అన్నాడు రంగారెడ్డి ఇద్దరినీ శాంతపరుస్తూ....

“సరే, అలాగే! ఎనిమిదోనెలే తగలేసుకోనీండి.” తగ్గి, అన్నాడు గోపాల్రావ్.

“మరి కిర్సనాయిలు మాటేమిటి?” మళ్ళీ అడిగాడు బట్టతలాయన.

“ఏం కిర్సనాయిలు?”

‘‘మీ అమ్మాయిని తగలెయ్యడానికి పాతికలీటర్ల కిర్సనాయిలు ఇస్తానని ఒప్పుకున్నారుగా, అదేది అనడుగుతున్నాను.”

“కిర్సనాయిలు సప్లయి చేస్తానని నేను వప్పుకోలేదే.”

“వప్పుకున్నారని మధ్యవర్తి చెపితేనే గదయ్యా- ఈ సంబంధం చేసుకోడానికి వప్పుకుంది.”

“ఏడీ మధ్యవర్తిని పిలవండి.”

“పిలవండి!”

అందరం మధ్యవర్తికోసం వెదికాంగానీ మామూలుగానే ఆయనెక్కడా కనిపించలేదు.

“అయ్యా, ముహూర్తం మించిపోతోంది. తాళి కట్టించేస్తే బావుంటుంది-” అన్నాడు పురోహితుడు.

“బోడి ముహూర్తం పోతేపోనీ, కిర్సనాయిలు సంగతి తేలందే తాళి కట్టడానికి వీల్లేదు! అబ్బాయ్ పీటల మీద నుంచి లేచి ఇక్కడికొచ్చేయి” అన్నాడాయన. రెడ్డి మళ్ళీ ఆయనను శాంతపరచడానికి ప్రయత్నించాడు.

“ఇదిగో చూడండి బట్టతలగారూ”

ఆయన కోపంతో ఎగిరిపడ్డాడు.

"ఏమిటీ! నా పేరు బట్టతలా?"

రెడ్డి ఖంగారుపడి నావేపు చూశాడు! "ఈయన పేరేమిటని ఇందాక నిన్ను అడిగితే "బట్టతల' అని చెప్పావుకదా! అన్నాడు గాబరాగా.

నేను ఎందుకయినా మంచిదని అక్కడ చేరిన గుంపువెనక్కు నడిచి, "ఊరికే అన్నాలేసరదాకి!" అన్నాను పరిగెత్తుకుంటూ పారిపోవడానికి రెడీగా నిలబడి.

"సారీ సార్! ఏదో పొరపాటు జరిగింది! ఇంతకూ మీ పేరేమిటన్నారు?"

"గాడిదగుడ్డు" ఇంకా మండిపడుతూ అన్నాడు.

"చూడండీ గాడిదగుడ్డు.. సారీ! మీరు కోపంగా ఉన్నట్లున్నారు. అలాంటి పేరెక్కడయినా ఉంటుందా ఏమిటి? సరే కానీండి! పేరొదిలేద్దాం! చూడండి. ఎవరికోడలిని వాళ్ళే కిర్సనాయిలు కొనుక్కుని తగలెయ్యడం మన సంఘ ఆచారం! మీరిప్పుడు కొత్తగా పుట్టింటివాళ్ళే కిర్సనాయిలుకూడా సప్లయి చేయాలంటే ఎవరికయినా ఇబ్బందే కదా..."

"గాడిదగుడ్డు! అలా సప్లయి చేసేవాళ్ళ అమ్మాయినే చేసుకుంటామని మధ్యవర్తికి క్లియర్‌గా చెప్పాను."

"అయినా అలా కిర్సనాయిలు అడగడమే చాలా తప్పండి!" అన్నాడు మా కాలనీ తాలూకు ఆంజనేయశాస్త్రి జనంలోంచి ముందుకొచ్చి,

"ఏమిటి? తప్పా!" బట్టతలాయన మళ్ళీ రెచ్చిపోతూ అడిగాడు.

"అవును."

"ఏమిటి తప్పు?"

"తప్పుకాకపోతే ఏమిటయ్యా! ఇవాళ మీరు కిర్సనాయిలు ఉచితంగా ఇమ్మంటున్నారు. రేపు ఇంకొకాయన అంటించడానికి అగ్గిపెట్టికూడా కావాలంటాడు. అసలే పెళ్ళి ఖర్చులూ, కట్నాలూ ఇవ్వలేక ఛస్తూంటే– పాతిక లీటర్ల కిర్సనాయిలు బ్లాకులో కొనియివ్వాలంటే మాటలా ఏమిటి?"

"అదంతా నాకనవసరమయ్యా! మా అబ్బాయికి కనీసం మూడు పెళ్ళిళ్ళయినా చెయ్యాలికదా! ముగ్గురి దగ్గర కట్నం, లాంఛనాలు వసూలు చేస్తేగాని వాడికి నాలుగు డబ్బులు మిగలవని మీరూ వప్పుకుంటారు! అవునా! మరి మిగిలే ఆ నాలుగు డబ్బుల్లో ముగ్గురు భార్యలను ఒకరి తర్వాత ఒకరిని విడివిడిగా కిర్సనాయిలు పోసి తగలబెట్టాలంటే ఎంత ఖర్చోమీరే ఆలోచించండి!" కొంచెం శాంతంగా అన్నాడు బట్టతలాయన.

"పోనీలేవయ్యా గోపాల్రావ్, కిర్సనాయిలు ఇచ్చేసేయ్, అయిన ఖర్చు ఎలాగూ అయింది. ఇంక ఇప్పుడు వెనక్కు తగ్గడందేనికి?" ఎవరో గోపాల్రావ్‌కి సలహా ఇచ్చారు.

"ఇమ్మంటారా?" సందేహంగా అడిగాడు గోపాల్రావ్.

"ఇచ్చేసెయ్! ఈ సంబంధం తప్పిందంటే మళ్ళీ ఎప్పటికి ఇంకో సంబంధం కుదురుతుందో ఏమో! ఈలోగా మీ అమ్మాయికి భర్త చేతిలో తగలబడేవయసుదాటిపోవటం లేదూ? ఏ వయసు ముచ్చట ఆ వయసులో జరిగితేనే 'ముద్దు' అన్నారు. అంటే, నా ఉద్దేశ్యం మీ అమ్మాయి కలకాలం ఇలాగే కిర్సనాయిలు చావుతప్పించుకునీ భ్రష్టత్వం పొందుతుందని కాదు. ఏదొక సంబంధం చూసి ఎలాగూ పెళ్ళిచేస్తావ్? ఆ అత్తమామలు, భర్తాకలసి ఎలాగూ కిర్సనాయిలు పోసి తగలెయ్యకా మానరు. ఎటొచ్చీ నీకు టైము ప్రకారం అమ్మాయిని తగలబెట్టించలేక పోయానే అన్న దిగులుండిపోతుంది ఆఖరివరకూను" నెమ్మదిగా నచ్చజెప్పాడు జనార్ధన్.

"సరే" అన్నాడతను.

అంతలోనే గోపాల్రావ్‌గారి భార్య సావిత్రమ్మ కస్సున లేచింది.

"ఏమిటి, కిర్సనాయిలు ఇస్తారా? అమ్మాయి వయసు దాటిపోతోందిక దాని ఇలాంటి కొత్త పద్ధతులన్నీ మొదలెడితే ఇంక అయినట్లే. ఇవాళ కిర్సనాయిలు వప్పుకుంటే రేపు అగ్గిపెట్టికూడా ఇమ్మంటారు. ఆ తర్వాత మీ అమ్మాయి అంత్యక్రియల ఖర్చుకూడా పెట్టుకోమంటారు. ఇలా దీనికి అంతం ఎక్కుడుంది. వీల్లేదు, కిర్సనాయిలు ఇవ్వడానికి చస్తేవప్పుకోను" అందామె మొండిగా.

మరుక్షణం మా కాలనీ తాలూకూ ఆడవాళ్ళందరూ అలవాటు చొప్పున చప్పట్లు కొట్లారు ఉత్సాహంగా.

"అవును! ఇలా అడ్డమైన సౌకర్యాలు పెంచడానికి వీలులేదు" అంటూ అరిచారు కొంతమంది.

ఇక లాభంలేదని రెడ్డిగారు కల్పించుకున్నాడు.

"చూడండమ్మా! పద్ధతులనేవి కాలాన్నిబట్టి మారుతుంటాయి మనం అడ్డుపడ గూడదు. ఆ రోజుల్లో పద్ధతులేవేరు! మా తాతయ్య ఇప్పటికీ చెప్తుంటాడు. వాళ్ళకాలంలో మొగాళ్ళు ఒక్కటే పెళ్ళి చేసుకుని, ఒకే భార్యతో జీవితాంతం కాపురం చేసేవారట. అలాగే ఒకో వంశానికీ ఒక్కోరకమైన ఆచారాలు ఉంటాయి. మా వంశం ఆచారం ఏమిటంటే మగాళ్ళు వరుసగా ముగ్గురు భార్యలవరకూ కాల్చిచంపాలి. నాలుగోభార్య మాత్రం జీవితాంతం సంసారం చేయాలి. ఏ పరిస్థితుల్లోనూ ఆమెను కిర్సనాయిలు పోసి కాల్చి చంపకూడదు. ఒకవేళ తనంతట తానుగా ఆమె ఆత్మహత్య చేసుకోవడం– లేదా చనిపోవడం జరిగితే అప్పుడుగాని ఇంకో పెళ్ళి చేసుకోడానికి వీలులేదు!

అలాగే ఆంజనేయశాస్త్రి వంశ సంప్రదాయం ప్రకారం పెళ్ళయిన సంవత్సరంలోగా వరుసగా నలుగురు కోడళ్ళను అత్తామామలు మాత్రమే కిర్సనాయిలు పోసి నిప్పంటించాలి.

వాళ్ళ కొడుకు కేవలం వారికి సహాయం చేయాలిగాని స్వయంగా నిప్పంటించకూడదు.

ఇక జనార్ధన్‌గారి సంప్రదాయం మరో రకంగా వుంటుంది. ఇంటి కోడల్ని భర్తగానీ, అత్తమామలుగానీ చంపడానికి వీలులేదు. ఆమె ఆడపడుచులే స్వయంగా మంచిరోజు చూసి కిర్సనాయిలు పోసి నిప్పంటించాలి" అంటూ ముగించాడు రెడ్డి.

సీతారామయ్యగారు చేతికర్రతో వణుకుతూ ఉత్సాహంగా కుర్చీలోంచి లేచి నిలబడ్డాడు. ఆయన కూడా ఏదో చెప్పడానికి సరదాపడుతున్నాడని అందరికీ అర్థమయిపోయింది.

"మాది బాగా వెనుకబడ్డ ప్రాంతం కదా! అక్కడ యింకో సంప్రదాయం ఉంది. అదేంటంటే భర్త భార్యను తగలబెట్టే రోజునే– అత్తగారినీ, తల్లినీ కూడా చంపేయాలి. ఆ తర్వాత ఆ భర్తా అతని తండ్రి మామగారూ– ముగ్గురూ ఒకే పందిట్లో మళ్ళీ పెళ్ళిళ్ళు చేసుకోవాలి!"

హేమలత ఠక్కున అందుకుంది.

"అవున్లెండి, ఎవరి సంప్రదాయం వాళ్ళది. మాలో పద్ధతి ఇంకో రకం. పెళ్ళయాక ఆమెను ఎవరూచంపరు. తనంతటతనే ఓ గదిలో కిర్సనాయిలు పోసుకుని నిప్పంటించుకుని చచ్చిపోవాలి. అప్పుడు భర్త ఆమె స్వహస్తాలతో "తన చావుకి ఎవరూ బాధ్యులుకారనీ, అత్తమామలూ, భర్తా ఆడపడుచులు అంతా దేవతలూ– లేక దేవుళ్ళనీ, కేవలం తనకే సరాదా పుట్టి ఛస్తోందని" రాసిన ఉత్తరం లగ్నంనాడు అతని ఉత్తరీయంలో కట్టిన మూటనుంచి తీసి పోలీసుల కిస్తారన్నమాట! అయితే ఈ ఉత్తరం అందుకునే పోలీస్ ఇన్‌స్పెక్టరికీ ఒక కానిస్టేబుల్‌కీ మనం బట్టలు పెట్టాల్సివుంటుంది! పవిత్రకార్యంగదా మరి."

సీతారామయ్యగారికి పాతరోజులన్నీ కళ్ళముందు మెదలినట్లున్నాయ్.

"ఇదేకాదర్రా! ఆ రోజుల్లో భార్యలను ఇప్పటిలాగా డైరెక్ట్‌గా కాల్చేవాళ్ళుకాదు. ముందు కట్నాలగురించో, మరో వస్తువు గురించో వియ్యాలవారితో వివాదం పెట్టుకునేవాళ్ళు. అవన్నీ తెమ్మని భార్యను బాగా వేధించాక అప్పుడు కిర్సనాయిలు పోసి నిప్పంటించేవారు. ఒకవేళ వియ్యాలవారు అడిగినవన్నీ ఇస్తే ఆమెను చివరికంటా అస్సలు చంపేవారేకాదు! అలాగే కాపురం చేయనిచ్చేవాళ్ళు! అంత అజ్ఞానం ఉండేదారోజుల్లో."

ఈ గొడవంతా వింటున్న పెళ్ళికొడుక్కి చిరాకు పుట్టుకొచ్చింది. చేతిలోని మంగళసూత్రం నేలకేసి కొట్టాడు. "నేనేం హరికథలు వినడానికి రాలేదయ్యా! ముందు కిర్సనాయిలు ఇస్తారా ఇవ్వరా తేల్చండి?" అన్నాడు మొండిగా, శాయిరామ్ మంగళసూత్రం అతని చేతికిచ్చి సమాధానపర్చాడు.

"అలా తొందరపడితే ఎలాగయ్యా! ఓ పక్కన మీ మామగారు ఇస్తానని ఒప్పుకున్నారుగదా! మీ అత్తగారికి యెలాగోలా నచ్చజెప్తాంలే! అల్లరి పడకు?"

"మీరెంతసేపూ అంతఖర్చు అని గొడవేగాని మా పెళ్ళికొడుకుల సైడ్ కొంచెం కూడా ఆలోచించాలండీ! పెళ్ళయిన తర్వాత షుమారు సంవత్సరంపాటు భార్యను మేపి ఆ పెట్టుబడికి దమ్మిడీ రాబడి రాకుండానే అంతేసి కిర్సనాయిలు పోసి కాల్చిచంపాలంటే ఎవరికయినా ఎంతకష్టం? పోనీ అలా అని జీవితాంతం దానిని కాల్చకుండా బయటకు తోలేద్దామా అంటే లేనిపోని కాంప్లికేషన్స్ వస్తాయి! అదీగాకుండా మొదటిభార్య కిర్సనాయిలు పోసుకుని తగలెట్టుకున్నదని ఋజువయితేగాని మరోపిల్ల నివ్వడాని ఎవరూ ముందుకిరారు. అయినా భార్యలతో కట్నం వస్తోందన్నమాటేగాని పెద్దగా మాకు మిగిలిచచ్చేదెక్కడ? సంవత్సరంపాటు తిండి, ఆ తరువాత కాల్చిచంపడానికి కిర్సనాయిలు, అగ్గిపెట్టెలు, దహనక్రియల ఖర్చులు దినవారాల ఖర్చులూ, అస్తికలు గంగలో కలపడాలు, ఇంట్లో పెద్దఫోటోలు ఫ్రేములు కట్టించి తగిలించడాలు– ఎంత ఖర్చో మీరేలెక్కవేసుకోండి. గోపాల్రావ్‌గారు ఈ విషయంలో ఎంతో అభ్యుదయ భావాలున్నవారు కాబట్టి అడగ్గానే ఠక్కున వప్పుకున్నారు" అన్నాడు పెళ్ళికొడుకు.

మళ్ళీ సీతారామయ్యగారు అందుకున్నారు.

"నన్నడిగితే భార్యలను కిర్సనాయిలుతో చంపడం మానేయడం మంచిదంటాను! ఎందుకంటే రాన్రాను కిర్సనాయిలు ధర తెగపెరిగిపోతోంది. వేరే ఇంకేమయినా చౌకరకం ఆయిల్ ప్రభుత్వం సప్లయ్ చేయాలి. లేదా అసలు ఆడదాన్ని చంపకుండా బానిసలుగా అమ్మిపారేసే పద్ధతయినా బాగానే ఉంటుంది. ఇటువంటి పద్ధతివల్ల ఆటు ఖర్చూ తప్పుతుంది. ఇటు కొంతరాబడీ వుంటుంది. మరోపక్క కొన్నవాడు గొడ్లకు బదులుగా స్త్రీలను ఉపయోగించుకుని లాభపడే అవకాశమూ ఉంటుంది. ఈ పద్దతి ఇప్పటికే కొన్ని దేశాల్లో అమలులో ఉంది–"

ఆ మాట పూర్తికాకుండానే ఆడాళ్ళంతా ఏకమయి సీతారామయ్య మీద విరుచుకుపడ్డారు "అలా జరగడానికి వీల్లేదు. ఆడాళ్ళు పశువులు కాదు, అలా బానిసలుగా అమ్మి పారేయడానికి. భర్త చేతిలో కిర్సనాయిలు చావు చావడం మా జన్మహక్కు. ఇది మా భారతదేశ సాంప్రదాయం. మా నాగరికత. ప్రపంచంలోకెల్లా గొప్పవయిన మన ఆచారాలు తొలగించడానికి మేము ససేమిరా వప్పుకోము" అంటూ ఆవేశంగా అరిచారు. పరిస్థితి విషమించేలా ఉందని శాయీరామ్ చిరునవ్వుతో మధ్యలోకొచ్చాడు.

"సోదరులారా, సోదరీమణులారా, మనలో మనకి గొడవెందుకు? మనం అటు గోపాల్రావ్‌గారి భార్యావాదననూ కొట్టేయడానికి వీల్లేదు. ఇటు పెళ్ళికొడుకూ, అతని తండ్రి అండ్ కంపెనీవాళ్ళు అడిగేదానికి కాదనలేము. ఎందుకంటే మనందరికీ కూతుళ్ళతోపాటు కొడుకులూ వున్నారు మన కూతురు ఒకింటికి కోడలైనట్లే, ఒకింటి కూతురూ మనింటికి కోడలుగా రాక తప్పదు. మరి మనింటి కోడళ్ళను మనమే స్వయంగా కిర్సనాయిలు పోసి

నిష్పంటించడమూ సహజమే. అంటే మరి మనకూ ఖర్చుపెరుగుతుంది కదా! కనుక మనమందరం ఓ కొత్త పద్ధతి అవలంబిస్తే బావుంటుంది. అదేమిటంటే పెళ్ళికొడుక్కి ఒకేసారి ముగ్గురమ్మాయిలతో పెళ్ళిచేసిపారేస్తే అటు ముగ్గురికట్నం ఒకేసారి వస్తుంది. ఇటు వాళ్ళందరినీ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చంపే పద్ధతి బదులు ఒకేసారి కట్టకట్టి కిర్సనాయిలు పోసి అంటిస్తే ఖర్చు పూర్తిగా తగ్గిపోతుంది. ఎందుకని? అందరికీ కామన్‌గా దహనక్రియలు, కామన్‌గా దినవారాలు, అందరి అస్థికలూ ఒకటేసారి గంగలో కలపడం ఆ తరువాత ఆ ఫోటోలకు జీవితాంతం జరిపే ఖర్చు కామన్– ఇలా ఎంత లాభమో చూడండి...."

ఓ క్షణం అంతా నిశ్శబ్దం అలుముకుంది. ఆ తరువాత ఎవరికి వాళ్ళు పక్కవాళ్ళతో తర్కించుకోవడం ప్రారంభమయింది.

"మీరు చెప్పింది చాలా బావుంది అన్నయ్యగారు!" అంది రాజేశ్వరి ఆడాళ్ళతరపున.

"అవును–" అన్నారు మిగతావారు.

"మీరేమంటారండి" అంటూ బట్టతలనడిగాడు శాయీరామ్

"గాడిదగుడ్డంటాను." మండిపడుతూ అన్నరాయన.

"అదేమిటి?"

"లేకపోతే ఏమిటయ్యా, నాక్కావలసింది మీ బోడి సంఘసంస్కరణలు కాదు. కిర్సనాయిలు ఇప్పుడు ఇస్తారా, ఇవ్వరా, అంతే, ఒక్కటే జవాబు కావాలి."

"ఇవ్వకపోతే ఏం జేస్తావ్?" అన్నాడు మా కాలనీ యువజన నాయకుడు సంగీతరావు.

"ఏం జేస్తానా?" 'ధూ' అని ఊసి పెళ్ళి చేసుకోకుండా ఇక్కడ నుంచి వెళ్ళిపోతాం."

"వెళ్ళడానికి మీకు కాళ్ళులేవుగా."

"కాళ్ళు లేక పోవడమేమిటి? ఇవి కాళ్ళుకాదూ.?"

"ఇప్పుడున్నాయండీ! 'ధూ' అని ఊసి బయల్దేరాక ఇంక అవెందుకుంచుతాం మేము? అన్నీ విరగ్గొట్టి ఇక్కడే ఓ మూల కుప్పపడేస్తాం."

"ఏంట్రా? నా కాళ్ళు విరగ్గొడతావా?" అంటూ అతని మీదకు దూకాడు బట్టతల. అంతే, ఆ తరువాత ఏం జరిగిందో తెలీదు. కుర్చీలు, బల్లలూ, స్టీలు చెంబులూ, గ్లాసులూ, అన్నీ తుఫాను గాలి కెగిరినట్లు గాలిలోకి ఎగిరిపడేవరకే నాకు గుర్తుంది. అందులో ఒకటి ఏదో ఎగిరివచ్చి బలంగా నా నెత్తికి కొట్టుకోవడం కూడా కొంచెం గుర్తుంది. తిరిగి కళ్ళు విప్పేపటికి మా ఇంట్లో నా గదిలో మంచం కింద పడివున్నాను.

మా ఇంటి సభ్యులందరూ నా చుట్టూ మూగి విచిత్రంగా చూస్తున్నారు. పక్కనే పడివున్న ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపర్లో మొదటి పేజీలో "ఇంకో పెళ్ళికూతురిని తగలేసిన

కేసు" అన్న హెడ్డింగ్ ఇంగ్లీషులో కనబడుతోంది. లోపల్నుంచి రేడియోలో– 'కాదుసుమా కలకాదుసుమా' అన్న పాట వినబడుతోంది.

ఈ కథ మీకు హాస్యం అందిస్తే అందించవచ్చు!

కానీ ఈ కథ మనదేశంలోని పరిస్థితి చూసి నవ్వాలో ఏడవాలో తెలీక రాసినకథ! సినిమాల్లో చూద్దామా తాగి తనను చితకతంతున్నా భర్త కాళ్ళు పట్టుకుని వదలని స్త్రీ పాత్రలు– భర్తను మరో స్త్రీకి మనం చూస్తుండగానే త్యాగంచేసి పారేసే పాత్రలు–

బయట చూద్దామా, కట్నలాంఛనాలకోసం– అత్తమామలు, భర్తా పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్యలు చేసుకోవడం– లేదా హత్యగావింపబడడం–

ఇవన్నీ అలా వుంచి ఈ పరిస్థితిని రాన్రాను అందరూ చాలా మామూలు విషయాల్లా– కాజువల్‌గా ట్రీట్ చేయడం– ఇది మరీ ప్రమాదకరమయిన పరిస్థితి.

"ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే– ఈ కథ త్వరలోనే నిజమైపోవడం ఖాయం! అప్పుడింక కన్నీళ్ళూమిగలవ్! నవ్వూమిగలదు!

